క్లుప్తంగా

బుసక ట్రాక్టర్ సీజ్



కొల్లూరు : అక్రమంగా బుసక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు కొల్లూరు పోలీసులు తెలిపారు. మంగళవారం మండలంలోని పెసర్లంక నక్కపాయ ప్రాంతం నుంచి ఓ ట్రాక్టర్‌లో బుసక నింపుకొని అక్రమ రవాణా చేస్తుండగా వీఆర్వో జగదీష్ ట్రాక్టర్‌ను నిలిపి రికార్డులు చూపాలని ప్రశ్నించారు. బుసక తరలింపునకు ఎటువంటి అనుమతులూ లేకపోవడంతో కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అర్జున్ పేర్కొన్నారు.

సేంద్రియ సేద్యంతో నాణ్యమైన దిగుబడులు



పిట్టలవానిపాలెం: సేంద్రియ సేద్యంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని ఐసీఆర్‌పీ చేబ్రోలు ఏసోబు తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం గోకరాజునల్లిబోయినవారిపాలెం శివారు దివాన్ తోటలోని వరి పొలంలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో ప్రధానంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఎకరానికి 5 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం వల్ల పురుగులను లార్వాల దశలోనే అరికట్టవచ్చని వివరించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

రేపల్లె రూరల్: పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన పట్టణంలో మంగళవారం సాయంత్రం జరిగింది. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో పట్టణంలోని ఫిష్ మార్కెట్ సెంటరులో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. ఫిష్ మార్కెట్ సెంటరులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వీరి వద్ద నుంచి రూ.10,740 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

ఆధ్యాత్మిక భావనతోనే సత్కర్మలకు అవకాశం



తెనాలి: ఆధ్యాత్మిక భావనతోనే మానవుడు ఉత్తమ కర్మలు చేపట్టే అవకాశం ఉంటుందని 'ఇస్కాన్' తెనాలి జగన్నాథ మందిరం అధ్యక్షుడు సింహ గౌరదాస్ అన్నారు. పట్టణంలోని నాజరుపేటలో ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కృష్ణాష్టమి వేడుకలు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. చివరిరోజు మంగళవారం ఉదయం స్వామివారికి ధూప దీప హారతులు ఇచ్చిన విశేషమైన కీర్తనలను ఆలపించారు. 108 రకాల పిండి వంటలతో ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సింహ గౌరదాస్ సందేశమిస్తూ, భగవంతుడికి నిత్యం చేసే సేవ వల్ల మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని చెప్పారు. అంచే వెంకట్రావు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఉమ్మలనేని జానకీ రామచంద్రరావు, గోపినాథ్ దాస్, జనార్దన్ దాస్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

తెనాలిఅర్బన్: జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ, హౌసింగ్ ఈఈ వై.భాస్కరరావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం జగనన్న కాలనీల నిర్మాణాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికను రూపొందించిందని, దానిని వెంటనే అమలు చేయాలని సూచించారు. అధికారులు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇళ్ల నిర్మాణాల పథకం డిసెంబర్ 31తో ముగియనున్నదని చెప్పారు. ఆ లోపు మొదటి విడత ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. కాంట్రాక్టర్‌లు, లబ్ధిదారులతో మాట్లాడి పనులు పునఃప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా లబ్ధిదారులు సొంతగా నిర్మించుకుంటూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తమ దృష్టికి తీసుకువస్తే అలాంటి వారికి డ్వాక్రా రుణాలు ఇప్పించే విధంగా చూడాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే ఎప్పటికప్పుడు బిల్లులను అప్‌లోడ్ చేస్తూ లబ్ధిదారుల అకౌంట్‌లో నగదు జమ అయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, హౌసింగ్ డీఈ రఫీ ఉల్లాఖాన్, హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మహిళా వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి



వైద్యశాలల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి. మహిళా వైద్య సిబ్బంది కోసం ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులను నియమించాలి. ఆస్పత్రుల్లోని ప్రతి విభాగంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు అమలు చేయాలి. ముఖ్యంగా రాత్రుళ్లు వైద్యసేవలు అందించే సిబ్బందికి రక్షణ కల్పించాలి. ఆస్పత్రుల పరిసరాల్లో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి.

– చేబ్రోలు సుశీల, స్టాఫ్ నర్స్, రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల



చిన్ననాటి నుంచే నైతిక విలువలు నేర్పాలి



కోల్‌కతా మెడికోపై హత్యాచార ఘటన కలచివేసింది. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వైద్య సిబ్బంది భద్రతకు చర్యలు చేపట్టాలి. రాత్రుళ్లు విధుల్లో ఉండే మహిళల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళలపై గౌరవంగా ఉండాలని, నైతిక విలువలు అలవర్చుకోవాలని పిల్లలకు చిన్ననాటి నుంచే మనం నేర్పాలి. అప్పుడే సమాజంలో అబలలకు రక్షణ ఉంటుంది.

–కె.కుమారి, ఏఎన్ఎం, భట్టిప్రోలు

ఉట్టికెగిరిన ఉత్సాహం

భట్టిప్రోలు/పిట్టలవానిపాలెం : కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. వెల్లటూరు గ్రామదేవతలు ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవాలయంలో మంగళవారం ఉట్టి ఉత్సవం నిర్వహించారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అమ్మవార్లకు సామూహిక పూజలు చేశారు. ఆలయ అర్చకులు క్రోవి రామకృష్ణ శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే మహోత్సవంలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమాలను కట్లమ్మ తల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ పర్యవేక్షించింది.

■ భట్టిప్రోలు సాధన మండలి, బ్రహ్మ విద్యాశ్రమంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం గో పూజ, శ్రీకృష్ణ పరమాత్మునికి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కోలాటం ప్రదర్శించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహకారంతో పూజలు జరిగాయి. అనంతరం ఉట్టి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సాధన మండలి అధ్యక్షులు బూర్లె అరుణకుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సాధన మండలి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

■ అద్దేపల్లి సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణ జన్మాష్టమి సందర్భంగా మంగళవారం ఉదయం గోపూజ, తులసీ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృష్ణునికి పంచామృత అభిషేక స్నపన, అనంతరం కృష్ణ పూజ, ఊయల సేవ, మహా నివేదన జరిగాయి. మధ్యాహ్నం విశ్రాంత ఉద్యోగులు, శాశ్వత చందాదారులను సన్మానించారు. అన్న సమారాధనలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఉట్టికొట్టే ఉత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం చేశారు. కార్యక్రమాలను కృష్ణ యాదవ సమితి పర్యవేక్షించింది. పూజా కార్యక్రమాలు దీవి వేంకట నాగ శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి.

■ పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలోని రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంవీఎస్ వర్మ తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు ఆలయం ఆవరణలో వేడుకలు జరుగుతాయని వివరించారు. చిన్నారులకు కృష్ణ, గోపిక వేషధారణ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.



వెల్లటూరు కట్లమ్మ ఆలయంలో ఉట్టి ఉత్సవం



అద్దేపల్లిలోని సంతాన వేణుగోపాలస్వామికి పంచామృత అభిషేక స్నపన నిర్వహిస్తున్న దృశ్యం



భట్టిప్రోలు సాధన మండలిలో గో పూజలో పాల్గొన్న భక్తులు

పాలిథీన్ వినియోగాన్ని అరికట్టాలి

రేపల్లె మున్సిపల్ కమిషనర్ శేషాద్రి



రేపల్లె రూరల్: ప్లాస్టిక్, పాలిథీన్ వినియోగాన్ని అరికట్టే యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి చెప్పారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని పేర్కొన్నారు. అందరూ గన్నీ, వస్త్రాలతో చేసిన సంచులు వాడాలని సూచించారు. పాలిథీన్, ప్లాస్టిక్ సంచుల విక్రయించినా, వినియోగించినా జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పరిరక్షణకు కృషి చేయాలి

పట్టణంలోని అందరూ పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని శేషాద్రి కోరారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను నిర్ణీత ప్రదేశాలలోనే పడేయాలని సూచించారు. రహదారులపైగానీ, కాలువల్లోగానీ పడేయరాదని చెప్పారు. వార్డులలోకి వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహించినా, ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరించకపోయినా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలూ బాధ్యతగా మెలగాలన్నారు.

సెల్‌టవర్ నిర్మాణానికి అనుమతులివ్వొద్దు

భట్టిప్రోలు: అద్దేపల్లి దళిత వాడలోని ఫెయిత్ టెంపుల్ వెనుక ఏర్పాటు చేస్తున్న 5జీ సెల్‌టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని ఆ ప్రాంత వాసులు పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ 1994లో జారీ చేసిన జీవో 334 ప్రకారం పంచాయతీ, టవర్ నిర్మిస్తున్న పరిధిలోని ఇంటి యజమానుల అనుమతి లేకుండా ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.సత్యనారాయణ, బి.నాగమల్లేశ్వరరావు, దానియేలు, కిరణ్, ఏసోబు, ఎలీషా, జార్జ్, ప్రతాప్, ప్రసన్న కుమార్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందచేస్తున్న అద్దేపల్లి వాసులు, చిత్రంలో సీపీఎం నాయకులు

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కర్లపాలెం: అగ్ని ప్రమాదంలో గృహాలు దగ్ధమై సర్వం కోల్పోయిన గిరిజన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించటం సంతృప్తికరంగా ఉందని ప్రముఖ ఆక్వా రైతు, వ్యాపారి నాయుడు వెంకట నారాయణ తెలిపారు. కర్లపాలెంలంక కాలువ కట్టపై విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం గృహాలు దగ్ధమైన తొమ్మిది గిరిజన కుటుంబాలకు వెంకట నారాయణ ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల చొప్పున రూ.90 వేల నగదు మంగళవారం అందజేశారు. అలాగే బాధితులకు ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి శ్రీనివాసరెడ్డి దంపతులు దుస్తులు, కూరగాయలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు చల్లా రామయ్య బాధితులకు దుప్పట్లు పంపిణీ చేయగా వాసవీ క్లబ్ సభ్యులు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. రాజన్న ప్రసాదం టీమ్ వ్యవస్థాపకుడు కొక్కిలిగడ్డ రామరాజు, బాధిత కుటుంబాల వారికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమాలలో జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏకొసిరి నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు చీరాల శ్రీనివాసరెడ్డి, కుంచాల శివనాగిరెడ్డి పాల్గొన్నారు.



అగ్ని బాధితులకు నగదు అందజేస్తున్న నాయుడు వెంకట నారాయణ.

పొలం వివాదంలో దాడి.. కేసు నమోదు

కొల్లూరు : పొలం వివాదంలో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన నిందితులపై కేసు నమోదైన ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బొద్దులూరుపాడు సమీపంలో ఉన్న పొలం విషయంలో పెసర్లంకకు చెందిన తల్లీకొడుకులు సాత బసవపున్నమ్మ, సాత శివ ప్రసాద్‌కు, తెనాలికి చెందిన దేవకర్ సంజు అనే వ్యక్తికి మధ్య వివాదం జరుగుతోంది. తమకు చెందిన పొలాలను ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని పెసర్లంకకు చెందిన తల్లీకొడుకులు ఆరోపిస్తున్నారు. ఈనేపథ్యంలో తెనాలికి చెందిన దేవకర్ సంజు వద్ద పొలం కౌలుకు తీసుకున్న టి.శివాజీ అనే వ్యక్తి సోమవారం పొలంలో ఎరువులు వేసేందుకు యత్నిస్తుండగా సాత శివప్రసాద్, బసవపున్నమ్మ అడ్డుకున్నారు. ఈవిషయంలో జరిగిన వివాదంలో కర్ర, బ్యాట్‌తో శివాజీపై దాడి చేసి గాయపర్చిన సాత శివప్రసాద్, బసవపున్నమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ అర్జున్ తెలిపారు.

సభ్యత్వ పెంపుతో పార్టీ బలోపేతం

తెనాలిరూరల్: సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతం అవుతుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని పట్టణ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 2 నుంచి భారతీయ జనతా పార్టీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం తెనాలిలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని సూచించారు. తెనాలిలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అందరూ పనిచేయాలని 10 వేల సభ్యత్వ నమోదు టార్గెట్‌గా సూచించారు. అదే విధంగా 88000 02024 నంబరుకు మిస్డ్ కాల్ ఇస్తే సభ్యత్వం నమోదవుతుందన్నారు. మాన్యువల్‌గా కూడా సభ్యత్వం చేసుకోవచ్చని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు అడపా రాయుడు, తెనాలి పట్టణ సభ్యత్వ ప్రముఖ్ అమ్మయ్య చౌదరి, మంగళగిరి సభ్యత్వ ప్రముఖ్ సీహెచ్. విజయ భాస్కరరెడ్డి, వాసుదేవనాయుడు, టి.అనంతాచార్యులు, సాయిగుప్తా, లక్ష్మీ దుర్గ, మల్లవరపు రాజు, కనకదుర్గ, శిఖా రవీంద్ర పాల్గొన్నారు.

రహదారిపై చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రేపల్లె రూరల్: స్థానిక 24వ వార్డు నేతాజీనగర్ కాలనీ సీసీ రోడ్డుపై గుర్రపుడెక్క, తూటికాడ, ఇతర వ్యర్థాలను పడేసిన వైనంపై మంగళవారం సాక్షి దినపత్రికలో చెత్త 'దారి'ద్ర్యం శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. జేసీబీని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్మికులతో రహదారిపై అడ్డంగా పడవేసిన వ్యర్థాలను తొలగించారు. ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు. సమస్య పరిష్కారం కావటంతో కాలనీ వాసులు ఊపిరిపీల్చుకున్నారు.



చిట్టడవిలా తుఫాన్ షెల్టర్

మోళ్లగుంట కట్టవలో ఉన్న మోడల్ తుఫాన్ షెల్టర్ భవనం బూత్ బంగ్లాలా మారింది. ఆవరణ పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు దట్టంగా పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. విష సర్పాలకు ఆవాసంగా మారింది. భవన గోడలపైనా పిచ్చిమొక్కలు మొలిచాయి. దీనివల్ల భవనం శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించటంతోపాటు భవనానికి మర్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– రేపల్లె రూరల్:

గుట్టుచప్పుడు లేకుండా..

- సామాజిక తనిఖీ ప్రజా వేదిక
- ఎవరికీ లేని సమాచారం
- ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కాని వైనం
- అధికారులతోనే పరిమితం



సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ ఉమాదేవి

కొల్లిపర: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అధికారులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలో అధికారులు 20 గ్రామాల్లోని ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సభ నిర్వహించారు. దీంతో ప్రజలు సామాజిక తనిఖీ ప్రజా వేదికపై, అధికారులపై, ఉపాధి హామీ పనులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి అయినా తనిఖీ నివేదికలు జరిగే సమయంలో ముందుగానే ప్రతి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, అధికారులు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా 1,565 వర్కులు చేయగా కూలీల వేతంగా రూ.5,04,48,300లు చెల్లించినట్లు తెలిపారు. మెటీరియల్ కింద రూ.1,78,68,443ల పనులు జరిగినట్లు వెల్లడించారు. మొత్తం రూ.6,83,34,443ల పనులు జరగగా వీటిలో సోషల్ ఆడిట్ బృందం రికవరీ గుర్తించింది కేవలం రూ.90వేలు మాత్రమే అని వెల్లడించారు. 20 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి రాళ్లు వేయకుండా నిధులు డ్రా చేసినట్లు తనిఖీ బృందం గుర్తించడం జరిగిందని, మరికొన్ని గ్రామాల్లో మస్టర్లలో తేడాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు లేక పోవటంతో అక్కడక్కడా మళ్లీ మొక్కలు నాటినారు. మొక్కలు నాటాలని సిబ్బందిని ఆదేశించారు. జెముడు గ్రామంలో ఒక వ్యక్తి పెరాలసిస్ ఉంది అని తప్పుడు సమాచారంతో రూ.15వేలు పింఛను తీసుకుంటున్నట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించినట్లు పీడీ తెలిపారు.

భగవద్గీత పారాయణం

తెనాలి: పట్టణంలోని రామలింగేశ్వరపేట దేవి చౌక్‌లో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం మంగళవారం సాయంత్రం ప్రత్యేక కుంకుమార్చన చేశారు. అనంతరం వందమంది సుహాసినిలతో భవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. తాడేపల్లి లలితా కామేశ్వరి, ధారా సత్యవతి, పాతూరి నిర్మల, మరో వంది మంది సుహాసినిలు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ టీవీఎస్ శాస్త్రి, ఉపాధ్యక్షుడు చివుకుల శివరామ్‌ప్రసాద్, కార్యదర్శి విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, కోశాధికారి ధారా బాలకృష్ణ, కోదండరాం, సభ్యులు కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇదేమి పారి'చోద్యం'

పిట్టలవానిపాలెం మండలంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగుకాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మురుగునీటి పారుదల సజావుగా సాగడం లేదు. కొన్నిచోట్ల రోడ్లపైనే నీరు నిలుస్తోంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో రోజూ కాలువల్లో పూడిక తీత చేపడితే ఈ దుస్థితి దాపురించేంది కాదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ కె.పద్మజను వివరణ కోరగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మురుగునీటి పారుదల సవ్యంగా సాగేలా చేస్తామని వెల్లడించారు.

– పిట్టలవానిపాలెం



ఖాజీపాలెం శివారు ముస్లిం కాలనీలో నిలిచిన మురుగు నీరు



పిట్టలవానిపాలెం గ్రామ సచివాలయం ముందు దుస్థితి



పీవీపాలెం శివారు గౌడపాలెం రహదారిపై నిలిచిన నీరు



ఖాజీపాలెం శివారు శివాలయం వెనుక వీధిలో ఇలా..

సెబ్ అధికారుల దాడులు

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరంలో అక్రమంగా తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో మంగళగిరి సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. జేసీబీతోపాటు డ్రైవర్‌ను ఎస్ఈబీ సిబ్బంది అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.